ప్రఖ్యాత కథా రచయిత శ్రీ చాసో సమర్పిస్తున్న మినీ కథల పరంపర

# మనసు

కె.ఎ.ఎస్. త్యాగరాజు

అప్పుడు నాకు పదమూడేళ్ళు.

నామనసుకు పదారేళ్ళు. రాము నా ఈడు వాడు. నా స్నేహితుడు.

శివాలయ ప్రాంగణంలో ధ్వజస్తంభపు చిరుగంటల ధ్వనులు ఆలకిస్తుంటే, ప్రసాదంమీదికి మనసు మళ్ళించేవాడు. హోమ్ వర్కు చేయలేదని మధనపడు తోంటే, స్కూల్ ఎగగొట్టమని సలహా ఇచ్చేవాడు పిల్లగాలికోసం చెరువు గట్టుకు చేరితే, 'పిల్లగాలి కోసమా!' అని రెట్టించి, వగలబడినవ్వి, నా అంతరంగంలో క్రొత్త ద్వారాలు తెరిచేవాడు.

అతను, నేను, జీడిమామిడి తోటలో తిరిగేవాళ్ళం. సరివీ తోపులో పరిగెత్తే



వాళ్ళం. మామిడితోటలో కూర్చుని పిచ్చాపాటి కబుర్లు చెప్పుకొనేవాళ్ళం.

అతనంటున్నాడు చేతిలో తీసికొన్న సంపెంగపూవును ఆఘ్రాణిస్తూ:

"నీ మనసు మారాం చేయదా?" అని.

"మేటవేసిన, ఇసుక ఎత్తులు, పల్లాలు, నున్నని ఉపరితలాలు - ఎంత అందంగా వున్నాయి - వాటిని తడమాలని, వాటిపై పొర్లిపొరలాలని నీకులేదా?" అని.

చెరువులో నే విసిరిన రాయికి అలలు ఒక దాని వెంట ఒకటి వర్తులాకారంగా విస్తరిస్తూ, ఒడ్డున చేరుతోన్న అలలు. నా అంతరంగంలో అలలు—అతను రేపినవి. కోర్కెల తీరానికి తగిలి విరుచుకొని పడుతున్నాయి.

"ఈ నిర్మానుష్య ప్రదేశానికి, ఎవరన్నా వస్తే, ఏం చేస్తావు నువ్వు?"

"ఎవరన్నా అంటే?"

"నీకు తెలియనా?"

"ఉహూఁ!"

"అయితే, నీమనసును అడుగు"

పున్నమినాడు కడలి అలజడి చెందుతోన్నట్టు, మనసు నిలకడ తప్పుతోంది.

ఏదో అలికిడి అయిన చప్పుడు. ఉలిక్కిపడి వెనుదిరిగి చూశాను. మా వెనుక ఎవరో క్రొత్తవ్యక్తి నుంచుని వున్నాడు. ఈత ఆకులు కోసుకోటానికి వచ్చాడు. సంస్కారం లేకుండా, బుజాలవరకు జీరాడుతున్న గిరిజాల జుత్తు. మోకాళ్ళను కూడా కప్పేసే పొడుగుచేతుల షర్టు. వయస్సు పదారేళ్ళు వుండవచ్చు! మరి, మనస్సో? నాకు తెలియదు.

చింతగింజల్లాంటి కళ్ళు! బత్తాయిపండు రంగు చాయ! చూడటానికి ఆకర్షణీయంగా వున్నాడు!

ఎంత సేపటినుండో మా ఊసులు వింటున్నట్లున్నాడు!

రామం అడుగుతోన్నాడు: "నువ్వేం చేస్తావో చెప్పు?"

అతనుపలుకడు. కళ్ళు నవ్వుతోన్నాయి.

"ఎవరున్నారిక్కడ? మనమేగా! భయము, సంకోచం ఎందుకు?—మనసు విప్పి చెప్పు!"

అతను తారాజువ్వలా దూసుకొంటూ, మెరుపులా మటుమాయమయ్యాడు. వాడికోసం వచ్చిన పిల్ల తోట చివర తొంగి చూస్తున్నది.

"పది రూపాయలు పందెం! ఈ నేరేడు చెట్టు ఎవరూ ఎక్కలేరగా...."

# పందెం



ఘంటికోట విశ్వనాథం

చుట్టూ వున్న స్నేహితులతో అన్నాడు శ్రీను.

వాళ్ళంతా కలిసి పదిమంది ఉంటారు, అందరూ కాలేజీ కుర్రాళ్ళే. ఆదివారం సరదాగా గడుపుదామని శ్రీను వాళ్ళింటికి వచ్చేరు. వర్షం పడుతున్నంతసేపు ఇంట్లో కేరమ్స్ ఆడుకొని వాన వెలిసి, ఎండపొడ వచ్చేక బయటకి వచ్చేరందరూ. ఇంటి కెదురుగా ఉన్న నేరేడు వాళ్ళని గమనిస్తూ ఉంది.

"నేను ప్రయత్నిస్తాను" అన్నాడు చెట్టును పరీక్షిస్తూ సత్యం.

అక్కడ వున్నవాళ్ళలో అందరికంటె కొంచెం వయసులో పెద్దవాడు సత్యం. తనకంటె చిన్నవాడు సవాల్ చేయడం అతనికి నచ్చలేదు.

"ప్రయత్నిస్తానంటే లాభం లేదు. చెట్టెక్కగలవా లేదా?" ప్రశ్నించాడు శ్రీను

"సరే! ఎక్కి చూపిస్తాను" కాండాన్ని చేతితో తాకుతూ అన్నాడు సత్యం. అంతకుముందు వర్షం పడటంవలన అంతా తడితడిగా వుంది.

శ్రీను వయసులో సత్యంకంటె చిన్నవాడయినా అతని తెలివితేటలు అమోఘం. లాభం లేనిది ఏ పనీ చెయ్యడు. వర్షాకాలం తడిసిన చెట్టెక్కడం తేలిక కాదని తెలుసు కాబట్టే ధైర్యంగా పందెం కాసేడతను.